


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నల్గొండ
యాదాద్రి
సూర్యాపేట

శనివారం 7 జూన్ 2025 పేజీలు 8


# ప్రజలు సహకరిస్తే తెలంగాణను 10 ఏళ్లలో వన్ ట్రిలియన్ ఎకానమీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

## రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి





నల్గొండ, మేజర్ న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం, తిరుమలగిరి గ్రామంలో సుమారు 1051.45 కోట్ల రూపాయల విలువచేసే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ పేద ప్రజలు దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు అయ్యేలా నిలబెడతానని, జపాన్, సింగపూర్ సరసన రాష్ట్రాన్ని నిలుపుతానని అన్నారు. దేశంలో వందేళ్లలో ఎవరు చేయని విధంగా మొదటిసారి కులగణను చేపట్టి రాష్ట్రంలో 56.36% బలహీన వర్గాలు ఉన్నారని లెక్కలు తీశామన్నారు. విద్యా, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వరులుగా చేయడంలో భాగంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా, 600 బస్సులను స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇచ్చి వారు వ్యాపార రంగంలో రాణించే విధంగా చేశామని, ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, పాఠశాల యూనిఫామ్ కుట్టే బాధ్యతలను మహిళలకు అప్పగించమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలకు నాలుగు లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, గతం నుండి పేదోడు ఇందిరమ్మ ఇండ్లలోనే ఉంటున్నాడని చెప్పారు.

ఆలేరు నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామని, ఎట్టి పరిస్థితులలో గంధమల్ల రిజర్వాయర్ ను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ అన్ని వర్గాల పిల్లలు ఒకే చోట చదువుకునే విధంగా 100 నియోజకవర్గాలలో 20వేల కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని, ప్రైవేట్ రంగంలో లక్ష ఉద్యోగాలు కల్పించామన్నారు. ఆరు నూరైన మూసీ నదిని ప్రక్షాళన చేసి గోదావరి నది జలాలతో మూసిని నింపుతామని తెలిపారు. గత 10 ఏళ్లలో గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులపై 2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే ఎస్ఎల్బీసీకి, డిండికి నిధులు ఎందుకు ఇవ్వలేదని? ఎందుకు పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ కు టిటిడి లాగే వైటిడి (యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్ మెంట్)బోర్డ్ ని ఏర్పాటు చేసుకోబోతున్నామని, తిరుపతిలో పద్మావతి మహిళ విశ్వ విద్యాలయం మాదిరిగానే ఇక్కడ చేపట్టే ప్రభుత్వ వైద్య కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్తామని, అలాగే విద్యాసంస్థలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లి దేశంలోనే గుర్తింపు ఉన్న యూనివర్సిటీగా తీర్చిదిద్దుతామని అన్నారు. మిగతా 3లో

# కెసిఆర్ పాలనంతా అరచేతిలో వైకుంఠమే...

- ప్రాజెక్టుల పేరు చెప్పి డబ్బులు దండుకున్నారు
- ప్రాజెక్టు కంటే కాంట్రాక్టర్లకే వేల కోట్లు ఎక్కడివి
- ప్రపంచంలో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం
- పదేళ్ల పాలనలో ఏ ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదు
- రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



భువనగిరి, మేజర్‌న్యూస్ : కెసిఆర్ పదేళ్ల పాలనలో రైతులకు ఈ ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదని పాలనంత అరచేతిలో వైకుంఠమేనని, పాలమూరు, రంగారెడ్డి ప్రాణహిత చేవెళ్ల, ఎస్ ఎల్ బి సి తదితర ప్రాజెక్టుల పేరు చెప్పుకొని పదేళ్ల పాలనలో చేసింది ఏమి లేదని శాశ్వతంగా ఇంతవరకు ఏ అభివృద్ధి పనులు చేయలేదని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.

మిగతా 3లో

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

## కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి




కోదాడ, మేజర్‌న్యూస్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా జీవిస్తామని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. మిగతా 3లో

# గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి,
- రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి
- నాగోల్‌లో రంగారెడ్డి జిల్లా బీజేపీ జిల్లా స్థాయి కార్యశాల సమావేశం







హయత్ నగర్, మేజర్ న్యూస్ : గ్రామీణులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించాలని, పల్లె పల్లెనా బిజెపిని బలోపేతం చేయాలని కార్యకర్తలు, నాయకులకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. నాగోల్ డివిజన్ పరిధిలోని శుభం కన్వెన్షన్ హాల్ లో రంగారెడ్డి జిల్లా స్థాయి కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏండ్లు పూర్తయిన సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. వర్క్ షాప్ ప్రధాన అంశాలుగా 11 సంవత్సరాల మోదీ పాలన, పర్యావరణ పరిరక్షణ, అంతర్జాతీయ యోగా దినోత్సవం, 50 సంవత్సరాల క్రితం ఎమర్జెన్సీ విధింపుపై, డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దినోత్సవం సహా వివిధ పార్టీ కార్యక్రమాలతో పాటు భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశం ప్రజాసేవ, పారదర్శక పాలనలో కొత్త ఒరవడిని ఏర్పరచిందన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త గ్రామ స్థాయిలోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని, యోగా దినోత్సవాన్ని ప్రజల మధ్యలో నిర్వహించి, ఆరోగ్యంపై చైతన్యం తీసుకురావాలి అన్నారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. 50 ఏళ్ల ఎమర్జెన్సీ చీకటి అధ్యాయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి, శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదానం దేశ సమైక్యతకు నిలువెత్తు ఉదాహరణగా పేర్కొన్నారు. బీజేపీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రభారి సుభాష్ చందర్ జీ, అసెంబ్లీ కన్వీనర్లు, జిల్లా కమిటీల కన్వీనర్లు ,కో కన్వీనర్లు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రధాన కార్యదర్శులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత్‌లో మొదటి జాతీయ పేపర్ ఎక్స్‌పో 2025 హైటెక్స్‌లో ప్రారంభం



బంజారాహిల్స్,మేజర్ న్యూస్ : : పేపర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత్లో తొలి జాతీయ పేపర్ ఎక్స్పో (పేప్ఎక్స్పో 2025) హైటెక్స్లో జూన్ 8 వరకు జరుగనుంది. ప్రగతి ఆఫ్సెట్ ప్రింటర్స్ ఎండీ పరుచూరి నరేంద్ర ఈ ఎక్స్పోను ప్రారంభించారు. ఎంఎస్ఎంఈ సహకారంతో నిర్వహితమవుతున్న ఈ మూడు రోజుల కార్యక్రమం పేపర్ వినియో గాన్ని ప్రోత్సహించడంతోపాటు, పర్యావరణ హిత పరిశ్రమగా దీని పాత్రను వెల్లడిస్తుంది.పాపిరస్ ఎక్స్పో సీఈఓ నిర్మల్ కుహాద్ మాట్లాడుతూ, భారత్లో 80% పేపర్ రీసైకిల్ వనరుల నుంచే తయారవుతుందని, అటవీ నష్టం అనే అపోహను తొలగించడం ఈ ఎక్స్పో లక్ష్యమన్నారు. ఎమామి పేపర్ మిల్స్ సీఎంఓ సౌమ్యాజిత్ ముఖర్జీ ఈ ఎక్స్పో కొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తుందని, పరిశ్రమ విలువ రూ. 80 కోట్లుగా ఉందని తెలిపారు. డిజిటలైజేషన్ వల్ల న్యూస్ప్రింట్ డిమాండ్ 50% తగ్గినప్పటికీ, ప్రాంతీయ భాషలు, ఈ-కామర్స్ వృద్ధి వల్ల క్రాఫ్ట్, రీసైకిల్ ప్యాకేజింగ్ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు.ఐపీపీటిఏ జనరల్ సెక్రటరీ ఎంకే గోయల్ మేక్ ఇన్ ఇండియాలో భాగంగా ఈ ఎక్స్పో జరుగుతుందని, దిగుమతుల నుంచి రక్షణ అవసరమని అన్నారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ డిప్యూటీ డైరెక్టర్ నటరాజ్ శిక్షణ, పరిశోధన ద్వారా పరిశ్రమ వృద్ధికి తోడ్పడతామన్నారు. 100కు పైగా సంస్థలు, 15,000 మంది సందర్శకులు ఈ ఎక్స్పోలో పాల్గొంటారు.

# సురభి వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు, బియ్యం పంపిణీ



మల్కాజిగిరి, మేజర్ న్యూస్: మల్కాజిగిరికి చెందిన సురభి వారధి ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎంబీఆర్ కామేశ్వర్ రావు ఆధ్వర్యం లో శుక్రవారం సాయంత్రం 50 కిలోల బియ్యం, నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కామేశ్వర రావు మాట్లాడుతూ..మా తండ్రి దివంగత వెంకట సుబ్రహ్మణ్యం పుట్టినరోజు సందర్భం గా ఖైరతాబాద్ జోన్ లో ఉన్న నిరాశ్రయ వసతి గృహానికి సురభి వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం, 24 మంది బాలలకు 18 జతల బట్టలు, క్లీనింగ్ ఐటమ్స్ ( సర్ఫ్ సబ్బులు రిన్ ) పంపిణీ చేశామన్నా రు. ఈ కార్యక్రమంలో నిరాశ్రయ హోమ్ ఇన్చార్జి రాము, సురభి వారధి ఫౌండేషన్ ప్రతినిధులు జి.వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారీగా డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టివేత



శేరిలింగంపల్లి,మేజర్ న్యూస్ : డిఫెన్స్ కు సంబంధించిన లిక్కర్ బాటిల్స్ ను మియాపూర్ లోని మాతృశ్రీ నగర్ లో పట్టుకున్నారు.రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ తెలిపిన వివరాల ప్రకారం మియాపూర్ మాతృశ్రీ నగర్ లోని ఓ రేకుల షెడ్ లో భారీగా లిక్కర్ బాటిళ్లు అక్రమ నిల్వలు ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించి రూ.5 లక్షల విలువ చేసే వివిధ బ్రాండ్ లకు సంబంధించిన 160 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.నిందితుడు మన్నవ గాంధీని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు.

## తనిఖీ



రాష్ట్రప్రభుత్వం మూడు నెలల రేషన్ అందిస్తున్న సందర్భంగా గాంధీనగర్‌లోని పలు రేషన్‌షాపులను ఎమ్మెల్యే ముఠాగోపాల్,బీఆర్ఎస్‌నేతలు ఆకస్మికంగా తనిఖీచేసారు. ప్రజలకు సక్రమంగా ,ఆలస్యం కాకుండా రేషన్ బియ్యంపంపిణీ చేయాలని డీలర్లకు ఎమ్మెల్యే సూచించారు. -ముషీరాబాద్,మేజర్‌న్యూస్

## రాష్ట్రంలో వెంటనే జర్నలిస్టులకు పూర్తిస్థాయి అక్రిడేషన్ కార్డులను జారీ చేయాలి : టి.డబ్ల్యూ.జె.ఎఫ్



సీతాఫలమండి, మేజర్ న్యూస్: రాష్టంలోని జర్నలిస్టులకు వెంటనే పూర్తి స్థాయి అక్రిడియేషన్ కార్డులను జారీ చేయాలని టి.డబ్ల్యూ.జె.ఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషణన్ (టి.డబ్ల్యూ.జె.ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, కార్యదర్శి ఇ. చంద్రశేఖర్, నాయకులు రఘు, జగదీష్, ప్రభాకర్ తదితరులు సచావాలయంలో సమాచార శాఖ కమీషనర్ హరీష్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అక్రిడియేషన్ కార్డులపై స్టిక్కర్ విధానానికి స్వస్తి చెప్పాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను చర్చించడానికి వీలుగా జర్నలిస్టులతో ఓ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో చేపడుతున్న జర్నలిస్టుల శిక్షణా తరగతులను ఐ.జె.యు. వాళ్లకే కాకుండా జర్నలిస్టుల సమస్యలపై రానున్న కాలంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య పేర్కొన్నారు.

# కెసిఆర్ పాలనంతా అరచేతిలో వైకుంఠమే...



**మొదటిపేజీ తరువాయి...** శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామ శివారులో ఏర్పాటుచేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యక్షతన బహిరంగ సభ నిర్వహించిన సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ,... పదేళ్లలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం దోచుకోవడం తప్ప... అభివృద్ధి చేయడానికి ఈ మాత్రం ప్రయత్నం చేయలేదని ఆయన ఆరోపించారు. 2015 రంగారెడ్డి పాలమూరు, తో పాటు వివిధ ప్రాజెక్టులను శంకుస్థాపనలు చేశారని ఆయన గుర్తు చేశారు. రైతులకు సాగునీరు అందించి ఉమ్మడి నల్లగొండ జిల్లాను శశ్యామలం చేస్తానని హామీ ఇచ్చారు. కానీ శంకుస్థాపనలు చేసి ఎక్కడి పనులు అక్కడే ఆపివేశారని ఏ ఒక్క రైతుకు కూడా ఒక ఎకరాకు సాగునీరు అందించిన పాపన్న పోలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సమావేశాలు ఏర్పాటు చేసి పాలమూరు రంగారెడ్డి ప్రాణహిత చేవెళ్ల, ఎస్ ఎల్ బి సి, తదితర ప్రాజెక్టు నిర్మాణానికి ఇతర ఎత్తిపోతలతో పాటు అర్థం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పూర్తి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం




**మొదటిపేజీ తరువాయి...** శుక్రవారం కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కొమరబండ లో వందరోజుల కార్యచరణ అమలులో భాగంగా స్థానికులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్ధాలను వివరించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి స్థానికులకు ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీముఖి, ఎస్సై సురేష్, ఈ ఈ భవాని, వార్డు ఆఫీసర్లు జానిమియా, సాయికృష్ణ, రాజయ్య, ఏఎన్ఎం నీరజ ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సహకరిస్తే తెలంగాణను 10 ఏళ్లలో వన్ ట్రిలియన్ ఎకానమీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం





**మొదటిపేజీ తరువాయి...** గత ప్రభుత్వం యాదగిరిగుట్ట మీద ఎవరు నిద్రించకూడదని నిషేధం విధిస్తే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిషేధాన్ని తొలగించి గుట్టపైకి వెళ్లే విధంగా ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ సన్న బియ్యం ద్వారా 80% ప్రజలకు కడుపునిండా అన్నం పెడుతున్నామని, సన్న బియ్యం పై 11,000 కోట్లు ఖర్చు చేసి ప్రతి ఒక్కరికి ఆరు కేజీల బియ్యం ఇస్తున్నామని చెప్పారు. దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న గంధమల్ల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ను 574 కోట్లతో చేపట్టి పూర్తి చేయనున్నామని, రిజర్వాయర్లో ఎక్కువ గ్రామాలు ముంపునకు గురికాకుండా రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.4 టీఎంసీలకు తగ్గించి 60 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా రూపొందించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం ఎస్ఎల్బిసి,డిండి ప్రాజెక్టుల తో పాటు, కృష్ణా నదిపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రజక్టులను చేపట్టలేదని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు .ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బునియదిగానీబ కాలువ అన్నింటిని పూర్తి చేస్తామని, అయితే లిఫ్ట్ ఇరిగేషన్ల కింద భూసేకరణను పూర్తి చేసే బాధ్యతను సంబంధిత శాసనసభ్యులు తీసుకోవాలన్నారు.. గత ప్రభుత్వం డిండి కి ఎక్కడినుండి నీరు తీసుకోవాలో గుర్తించలేకపోయిందని, అలాంటిది తాము 1800 కోట్ల రూపాయలతో ఎదుల రిజర్వాయర్ నుండి డిండి ప్రాజెక్టును మొదలుపెట్టబోతున్నమని, తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి ఎస్ఎల్ బి ని పూర్తి చేస్తామని చెప్పారు. తుమ్మడి హట్టి ప్రాజెక్టుకు నీళ్లు తీసుకువచ్చిన విధంగానే ,గంధమల్లకు నీళ్లు తీసుకువచ్చి సకాలంలో పూర్తి చేస్తామని. చెప్పారు .

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని, సన్న బియ్యంతో పేదవాడికి రెండు పూటలా అన్నం పెడుతున్నామని, ఇచ్చిన వాగ్దానాలే కాకుండా, ఇవ్వని వాటిని కూడా నెరవేరుస్తున్నామని, ఆలేరు నియోజకవర్గంలో మిషన్ భగీరథ కింద ప్రతి ఇంటికి మంచినీరు ఇవ్వనున్నమని, యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో తాగునీటితో పాటు, ఇండ్లు , డ్రైనేజి లు అన్ని కట్టిస్తామని తెలిపారు.

భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి చేస్తున్న పథకాలను వివరించారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ నియోజక వర్గంలో ఏ ఎం ఆర్ పి కింద మిగిలిపోయిన 10 కిలోమీటర్ల ఉప కాలువ పనులకు నిధులు ఇచ్చి పూర్తి చేయాలని, తుర్కపల్లి మండలానికి ఇండస్ట్రియల్ పార్కు మంజూరు చేయాలని, గుండాల కాల్వపనులకు నిధులు మంజూరు చేయాలని, బొమ్మలరామారంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు తీర్చాలని, కష్టాల్లో ఉన్న మదర్ డైరీ ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంతకుముందు ముఖ్యమంత్రి

574.56 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న గంధమల్ల రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు.

200 కోట్ల రూపాయలతో నిర్మించే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి , యాదాద్రి భువనగిరి జిల్లా లో 183 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో ఒకటో వార్డు నుండి 12వ వార్డు లలో 25.5 50 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, బిటి రోడ్లు ,స్త్రాం వాటర్ డ్రైనేజీ పనులకు పనులకు , 7.50 కోట్ల రూపాయల వ్యయంతో కొలనుపాక లో చేపట్టనున్నహెచ్ ఎల్ బి నిర్మాణ పనులకు , 6 కోట్ల రూపాయల వ్యయంతో కల్వలలో చేపట్టే హెచ్ ఎల్ బి నిర్మాణ పనులకు , మోట కొండూరు మండల కేంద్రంలో 8.25 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న తహసిల్దార్, ఎంపీడీవో, పోలీస్స్టేషన్ భవనాల నిర్మాణానికి . యాదగిరి గుట్ట మండలం దాతర్ పల్లి గ్రామంలో 22.75 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం పనులకు , 21.14కోట్ల రూపాయల వ్యయంతో ఆలేరు నియోజక వర్గంలో సి ఆర్ ఆర్, ఎం ఆర్ ఆర్ పనులతో చేపట్టే బిటి రోడ్ల పనులకు , ఆలేరు మార్కెట్ యార్డులో 2.75 కోట్లు రూపాయల వ్యయంతో చేపట్టనున్న 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం పనులకు శంకుస్థాపన చేశారు .

ఈ సందర్భంగా ముగ్గురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు .అంతేకాక స్వయం సహాయక మహిళా సంఘాలకు 54 కోట్ల 70 లక్షల రూపాయల బ్యాంక్ లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ,కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం ,మందుల సామెల్,ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, తీన్మార్ మల్లన్న, శ్రీపాల్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డైరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, పర్యటక్ శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిసిపి ఆకాన్స్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు .

## చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



కాప్రా, మేజర్ న్యూస్: చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎల్ బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ (ఐఏఎస్)ను తన కార్యాలయంలో కలిశారు. వర్షాకాలాన్నీ దృష్టిలో ఉంచు కొని వివిధ కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన జెడ్సీ మాట్లాడుతూ... త్వరలోనే పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన మహిళలుః జీవనది ఫౌండేషన్(ఇంటిలక్ష్మి దుర్గ),



ముషీరాబాద్,మేజర్న్యూస్ :ఉమర్అలీషా రూరల్ డెవలప్మెంట్ట్రస్టు,కొత్తపేట లయన్స్ క్లబ్(విజయరంగా)- ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సిటీకాలేజీలో, సావిత్రీబాయి పూలే ఆర్గనైజేషన్(బెల్లం మాధవి) కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంజుల రాణి,వాణి మహేశ్వరరావు, నాగరాజు, తిరుపతి, నవనీత పాల్గొన్నారు.

## నెహ్రూనగర్ లో జలమండలి, జీహెచ్ ఎంసీ అధికారుల పర్యటన



కాప్రా, మేజర్ న్యూస్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ లో శుక్రవారం జలమండలి అధికారుల పర్యటించారు. కాలనీ వాసుల వినతి మేరకు కాలనీలో నెలకొన్న సమస్యల పరిశీలన కొరకు జలమండలి డిజిఎం సతీష్, జిహెచ్ఎంసి, కాప్రా సర్కిల్ ఇంజనీరింగ్ డీఈ రూపతో కలిసి కాలనీలోని వివిధ బస్తీలలల్లో పర్యటించారు.

# ఒక మావోయిస్టు చనిపోతే 100 మంది మావోయిస్టులు పుడతారు



## సర్పంచ్ ల ఫోరం మునుగోడు మాజీ అధ్యక్షులు మిర్యాల వెంకన్న

మునుగోడు, మేజర్‌న్యూస్ : ఒక మావోయిస్టు చనిపోతే 100 మంది మావోయిస్టులు పుడతారని సర్పంచ్ ల ఫోరం మునుగోడు మాజీ అధ్యక్షులు మరియు మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు కూడా భారతీయులే వారిని చంపడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. కేంద్ర ప్రభుత్వం కంచెను వేసినట్లుగా భారతదేశ ప్రజలను ప్రాణాలను కాపాడవలసిన ప్రభుత్వం అట్లు మావోయిస్టులను, ఇటు పోలీసుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. భారతీయులను నిర్ధాక్షణంగా చంపడం ఇంతకైనా ఘోరం ఎక్కడ ఉండదనీ విమర్శించారు. ముఖ్యంగా మావోయిస్టు పార్టీ అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న పార్టీ ,కానీ ఒక భారతదేశంలో ఎర్రజెండా మావోయిస్టు పార్టీని అంతం చేసినంత మాత్రాన ఆ పార్టీ అంతం కాదన్నారు. ఈ కేంద్ర ప్రభుత్వం ఈ తప్పుడు విధానాలను అనుసరిస్తూ ప్రజలను తప్పుతోవ పట్టిస్తూ మావోయిస్టులు వారి అక్రమాలకు వారు చేసే దోపిడీలను వారు చేసే కుట్రను ఎక్కడ ఎదిరిస్తారని ముందస్తుగా మావోయిస్టులను అంతం చేయుటకు పూనుకున్నదనీ తెలిపారు. పూనుకున్నంత మాత్రాన మావోయిస్టులు అంతం కారనీ మళ్లీ మళ్లీ పుడుతూ ఉంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ విధానాలను మార్చుకొని అటు మావోయిస్టు ప్రాణాలను పోలీసుల ప్రాణాలను ప్రజల ప్రాణాలను కాపాడి మావోయిస్టులను ఇప్పటికైనా శాంతి చర్చలు జరిపి దేశ శాంతిని నడిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలి

**ఘట్టుప్పల్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు రావుల రమేష్**

మునుగోడు, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలనీ ఘట్టుప్పల్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు రావుల రమేష్ ఉపాధ్యాలను కోరారు. శుక్రవారం ఘట్టుప్పల్ మండలంలోని వెల్మకన్నె లో తెలంగాణ ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడికి పంపించి, గ్రామ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచలన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే ఉచితమైన నాణ్యమైన విద్యను పొందాలని తల్లిదండులను తెలిపారు. అనంతరం గ్రామ ప్రజలు, పెద్దలతో , ర్యాలీ నిర్వహించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి




గ్రామంలో ఉన్న పాఠశాలను బలోపేతం చేయాలి అని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుభాష్ చంద్ర, ఉపాధ్యాయులు మల్లయ్య, లింగయ్య, రాజేశ్వర చారి, సుమ, మల్లేష్, జై మునిసా, కాంగ్రెస్ గట్టుప్పల మండల ఉపాధ్యక్షులు రావుల రమేష్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు టేకుమట్ల శ్రీరాములు, చైర్మన్ పారిజాత, అంగన్వాడి టీచర్ వనజ , సంతోష, సంఘ బంధ నాయకురాలు రిజ్వానా, స్వరాజ్యం మరియు విద్యార్థులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిశుభ్రత మన అందరి బాధ్యత

## 100 రోజుల ప్రణాళిక లో భాగంగా తడి పొడి చెత్త పై అవగాహన: మున్సిపల్ కమిషనర్



జల్ పల్లి, మేజర్ న్యూస్ (జూన్ 06):పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ బి వెంకట్రామ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీలో పర్యటించి స్థానిక ప్రజలకు చెత్త పై అవగాహన కల్పించి, స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే, మనమందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. మన ఇళ్లను ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటామో, మన పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయొద్దని, తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి, ప్రతి ఇంటికి వచ్చే చెత్త ఆటో ట్రాలీలోనే చెత్తను వేయాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే జల్ పల్లి మున్సిపాలిటీ సుందరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ అధికారి శ్రీనివాస్, పారిశుద్ధ్య విభాగం సూపర్వైజర్ బి కుమార్, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జన్మదిన వేడుకలు



మునుగోడు, మేజర్‌న్యూస్ : సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య,మండల కార్యవర్గ సభ్యులు ఈ కైలాస్ , ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి బండారి శంకర్, ఉపాధ్యక్షులు గోస్కొండ మల్లేష్, కట్ట దశరథ, మోకాళ్ళ పరమేశ, బాబి, చాపల శేఖర్, స్వామి, నరేష్, కురుమూర్తి ముత్తయ్య, రామ్ కుమార్, శివ, రాజు ,లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్య ఎంఈవో





వలిగొండ, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా ఉన్నత పరిషత్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక ఎంఈవో సుంకోజు భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యను అందిస్తున్నారని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలని విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులతో పాటు మంచి విద్యను అందిస్తున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు బడిబాట కార్యక్రమంలో భాగంగా పాత తాహసిల్దార్ కార్యాలయం కిలానగర్ మరియు ఎస్సీ కాలనీలో బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోలేపాక నాగేందర్ సైదా రెడ్డి శ్రీనివాస్ విజయనిర్మల వెంకటేశ్వర్లు స్వామి లక్ష్మి కవిత చంద్రకళ మల్లేశం జిలాని స్వామి రాజ్ వెంకటేశం శివాజీ లింగయ్య శారద నవీన్ తదితరులు పాల్గొన్నారు.


## దోమల నివారణ అవగాహన కార్యక్రమం

కాప్రా, మేజర్ న్యూస్:చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో శుక్రవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పర్యటించారు. ఎంటమాలజీ ఈస్ట్ జోన్ ఇంచార్జ్ మాధవ రెడ్డి, ఏ ఈ రమేష్ తో కలిసి కార్పొరేటర్ ఇంటింటికి వెళ్లి దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నరేందర్, పరమేష్, నాగిళ్ల బాల్ రెడ్డి, బత్తుల శ్రీకాంత్ యాదవ్, బాల్ నరసింహ, క్రాంతి, నీరజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**చర్లపల్లి రైల్వే స్టేషన్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

కాప్రా, మేజర్ న్యూస్:చర్లపల్లి రైల్వే స్టేషన్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశించా రు. శుక్రవారం ఆయన చర్లపల్లి రైల్వే స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా టెర్మినల్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయా ల్సిన రోడ్లు, పార్కింగ్, వ్యాపార సముదాయాలు వంటి అంశాలపై మాట్లాడారు.

# శ్రీ పద్మావతి అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో,విశేష కుంకుమార్చన సేవ



భువనగిరి, మేజర్‌న్యూస్ : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ఏకాదశిని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు నవ కలుశ పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. ఉదయం 5:30 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు సుగంధ భరితమైన పుష్పమాలలను పట్టు పితంబరములను మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య తీసుకోని వచ్చి శ్రీ స్వామి వారికి తోమాల సేవ మరియు మేల్ చాట్ వస్త్ర సేవలో పట్టు వస్త్రములు సమర్పించడం జరిగింది. ఉదయం 10:30 లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి నవరత్నఖచిత స్వర్ణాభరణాలతో,పరిమళ భరిత పుష్ప మాలలతో అలంకరించి శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా తిలకించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 4000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 కు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య భక్తి గీతాలాపనలతో శ్రీ స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి మహా మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయన మనోహరంగా శ్రీవారిని దర్శించి ఆనంద పరవశులైనారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకలైశ్వర్య ప్రధాయిని అయిన శ్రీ పద్మావతి అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో,విశేష కుంకుమార్చన సేవ చేయడం జరిగింది. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

# జీఎంపీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక

**- అధ్యక్ష, కార్యదర్శులుగా దేవునూరి బాలయ్య, పాక జహంగీర్**




భువనగిరి, మేజర్‌న్యూస్ : జీఎంపీఎస్ మండల నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా దేవునూరి బాలయ్య, పాక జహంగీర్ ఎన్నికైనట్లు జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు దయ్యాల నరసింహ తెలిపారు. జీఎంపీఎస్ మండల కమిటీ ఎన్నిక శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. వారితో పాటుగా మండల ఉపాధ్యక్షులుగా పార్వతి దశరథ, తోటకూరి అశోక్, సహాయ కార్యదర్శిగా వడ్డే జమదగ్ని, వడి నాగరాజు, కోశాధికారిగా గంగనబో యిన పాండు, మండల కార్యవర్గ సభ్యులుగా ఏశ బోయిన అంజయ్య, గజ్జి నరసింహ, మన్నెబోయిన రాజలింగం, కదిరే జంగయ్య, తెలజురి మల్లేష్, బిట్కూరి లక్ష్మయ్య, మదిరే రాజయ్య, కుకుట్ల కృష్ణ, రసాల చంద్రయ్య లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి రెండవసారి ఎన్నిక చేసినందుకు తమకు మరింత బాధ్యత పెరిగిందని, గొర్రెల మేకల పెంపందర్ల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని తెలిపారు. తమ ఎన్నికలకు సహకరించిన గొర్రెల మేకల పెంపందారుల జిల్లా కమిటీ సభ్యులకు, మండల కమిటీ సభ్యులకు, గొర్ల కాపరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గూడు లేని పేదలు ఉండొద్దు : బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ (బిజెఆర్)

భువనగిరి, మేజర్‌న్యూస్ : ప్రజాపాలనలో భాగంగా పట్టణం లోని 8వార్డ్ సీత నగర్ లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లొ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన ప్రభుత్వ ఇంటి నిర్మానానికి శుక్రవారం రోజున బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ వార్డ్ ఇంచార్జ్ ఇందిరమ్మ గృహ నిర్మాణ భూమి పూజ చేసి ముగ్గు పరచి నిర్మాణ విధానాని. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం విడుదలవారీగా నిధులు మంజూరవుతాయని, ప్రధానం గా పేద, బడుగు, బలహీన, దళిత మైనార్టీ వర్గ కుటుంబాలకు కూడు, గుడ్డ, నీడ కోసం మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఇందిరమ్మ కళలను దేశం లోనేక్కడ లేని విధం గా తెలంగాణా లోని 33జిల్లాలో మొదట విడత గా నియోజకవర్గానికి 3500 ఇండ్లు, భువనగిరి పట్టణానికి 12 వందల ఇండ్లు, మన ఎనిమిదో వార్డుకు పట్టణంలోనే అత్యధికంగా 30 ఇండ్లు మంజూరు చేసిందని. ఇందిరమ్మ పథకం లో మున్సిపల్ పరిధిలో 8వ వార్డు లో ప్రభుత్వం మంజూరు చేసిన లబ్ది దారులకు ఇంటి కల సాకారం కానుందని. తెలంగాణ రాష్ట్రం లో మరియు మన భువనగిరిలో



ఇక ఇల్లు లేని నిరుపేద ఉండకూడదని కాంగ్రెస్ పార్టీ దేశం లో ఎక్కడ లేని విధం గా ఈ కార్యక్రమం అమలు చేసింది. ఇంకా ఎవరైనా ఇల్లు లేని వారు ఉన్నచో రెండవ విడత కూడా ఉంటుంది. ఎవరు భయపడవలసిన అవసరం లేదు. ఇల్లు లేని వారి అందరికి ఇల్లు ఇప్పించే బాధ్యత నేను తీసుకుంట అని, మన వార్డులో ఎక్కువ గా ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయి. రాని వారు ఇబ్బంది పడవలసిన అవసరం లేదు నేనున్న అని నా బాధ్యత అని మాజీ మున్సిపల్ చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు కడారి మంజుల, ఉడుత రమేష్, ఉట్కూరి భరత్ గౌడ్, డాకూరి ప్రకాష్, గోపే శివ, సిరిపంగ నాగరాజు,సంతోస్, వార్డు మున్సిపల్ ఇంచార్జ్ వినోద్ పాల్గొన్నారు.

# స్వర్గీయ సుద్దాల హనుమంతు 116వ జయంతి కార్యక్రమం - ఏశా ల అశోక్




భువనగిరి, మేజర్‌న్యూస్ : తెలంగాణ వైతాళికుడు బహుజన సాంస్కృతిక యోధుడు పలు ఉద్యమాలకు తన కలం గలంతో ఊపిరిలూదిన ప్రజా కళాకారుడు స్వర్గీయ సుద్దాల హనుమంతు 116 వ జయంతి ఈరోజు జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఆ మహనీయునికి నివాళులర్పించడం జరిగింది .

ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం తో పాటు తన బుర్రకత ద్వారా వందలాది గ్రామాలలో ప్రజలను చైతన్యవంతం చేశారని అనేక సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాతగా సుద్దాల హనుమంతు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య నాయకులు నాగపురి యాదగిరి ,బండి బాల నరసింహ, ఏనుగు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రివర్గంలో మాదిగలకు స్థానం కల్పించాలి



## బోయ లింగస్వామి మాదిగ

భువనగిరి, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన అతిపెద్ద సామాజిక వర్గమైన మాదిగలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావాలని ఉద్యమం చేసి జైలుకు వెళ్లిన వారిలో ఆత్మ బలిదానాలు చేసుకోని త్యాగాలు చేసిన వారిలో అత్యధికంగా మాదిగ బిడ్డలే ఉన్నారని అన్నారు ఆనాటి ఇందిరా గాంధీ కాలము నుండి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీని కాపాడిన వారిలో మొదటి భాగంలో మాదిగలే ఉన్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇట్టి విషయాలను గమనించి మంత్రివర్గంలో ఇప్పటికైనా అవకాశం కల్పించాలి. ఈ రాష్ట్రంలో మాలలకే 2 పదవులు ఇచ్చింది. ఇంకో పదవి ఇస్తా అని పబ్లిక్ సిటీ చేస్తుంది, పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలను ఎంత మోసం చేసిందో తెలిసిన విషయం కథ. ఈ రాష్ట్రంలో అత్యదిక జనాభా కలిగిన మాదిగలకి మంత్రి పదవి ఇవ్వాలి డిమాండ్ చేస్తు లేనియెడల మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి ఎమ్మార్పీఎస్ శ్రీకారం చుడుతుందని హెచ్చరిస్తున్నాం.

# ఎల్బీనగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

వనస్థలిపురం,మేజర్‌న్యూస్ః వనస్థలిపురం డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీలో సిసి రోడ్డు నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ పనులను శుక్రవారం స్థానిక కార్పోరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో క లిసి టి పిసిసి ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు యాష్కి గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతుందని, అందులో భాగంగానే ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధిచేస్తున్నామన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపించాలి : కస్నానాయక్



## బడిబాట కార్యక్రమంలో పాల్గొన మండలం విద్యాధికారి

మహేశ్వరం,మేజర్‌న్యూస్(జూన్ 6): పాఠశాలలకు వెళ్ళే విద్యార్థును ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాధికారి కస్నా నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లితండ్రులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లితండ్రులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతని వివరిస్తు, ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సదుపాయాలని, అందిస్తున్న నాణ్యమైన విద్య గురించి తెలిపారు. గ్రామంలోని విద్యార్థుల తల్లితండ్రులు, గ్రామ యువత ప్రతి ఒక్కరు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చేరేవిధంగా కృషి చేయాలన్నారు. మహేశ్వరం మండలంలోనే తుమ్మలూరు ప్రభుత్వ పాఠశాలకి ప్రత్యేక గుర్తింపు ఉందని, పాఠశాలకి అవసరమైన అన్ని సదుపాయాలని విద్యాశాఖ ద్వారా కల్పిస్తామని, పాఠశాలకి విద్యార్థుల సంఖ్యకి అనుగుణంగా రావాల్సిన కొంతమంది ఉపాధ్యాయులని డిఈవోతో మాట్లాడి పాఠశాలకి కేటాయించేలా కృషి చేస్తానని ఎంఈవో కస్నా నాయక్ హామీ ఇచ్చారన్నారు. పాఠశాలఅభివృద్ధికి కృషి చేస్తూ, గ్రామంలోని విద్యార్థులకి మంచి నాణ్యమైన అందిచటానికి తమ వంతు సహకారం అందిస్తున్న పూర్వ విద్యార్థులు కటికల. పూర్వ విద్యార్థులను మండల విద్యాధికారి ప్రత్యేకంగా అభినందించారు.

తుమ్మలూరు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ప్రత్యేక సదుపాయాలు:విద్యార్థులకి మంచి నాణ్యమైన విద్యని అందించటానికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సహకారం అందిస్తుండటంతో ఈ సదుపాయాలని ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. విద్యార్థులకి త్వరగా అర్థం అయ్యేలా డిజిటల్ లైబ్రరీ ని ఏర్పాటు విద్యార్థులకి డిజిటల్ టాబ్స్ ద్వారా ప్రత్యేక విద్య బోధన పాఠశాలలో ప్రాంగణంలో విద్యార్థులకి ప్రత్యేకమైన స్పోర్ట్స్ మెటీరియల్ ని ఏర్పాటు కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ ద్వారా ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహణ ప్రతి విద్యార్థి పైన ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, టెక్నాలజీతో విద్యాబోధన చెయటం 500 లీటర్ కెపాసిటీ కలిగిన ప్రత్యేకమైన ప్యూరిఫైర్ వాటర్ ఫిల్టర్ ని ఏర్పాటు, స్కూల్ ప్రాగణం అంత విద్యార్థుల కోసం మంచి ఆహ్లాదం కలిగించేలా పెయింటింగ్స్ వెహించటం జరిగింది,

ఉన్నత పాఠశాలలో అన్ని తరగతులకి డిజిటల్ స్క్రీన్ ద్వారా విద్యాబోధన రకాల సదుపాయాలతో ప్రయివేట్ పాఠశాలకి దీటుగా ప్రభుత్వ పాఠశాలని తయారు చేసుకుంటున్నామన్నారు. గ్రామంలోని విద్యార్థులందరిని ప్రభుత్వం పాఠశాలలోనే చేర్పించాలని మండల విద్యాధికారి పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రవౌళి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు యాదగిరి, మహబూబ్ , విద్యార్థులు తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు కేసును ఎత్తివేయాలి

## కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్



షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (జూన్ 06): ఓ పత్రికకు చెందిన ఎడిటర్‌పై రాజోలు పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే అతనిపై పెట్టిన కేసును ఎత్తివేయాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందుకు సంబందించి ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద దన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేఖంగా స్థానిక రైతులు ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సంఘటన స్థలాలలో ఎక్కడా కూడా లేని ఓ పత్రికా సంపాదకున్ని టార్గెట్ గా చేసుకుని అక్రమ కేసు బనాయించి ఏ2 గా చిత్రీకరించడం తగదన్నారు. ప్రజాపోరాటాలను పత్రికలో వేయడమే తప్పు అయితే పత్రికా వ్యవస్థ ఉండి ఏం లాభం అన్నారు. ఇందంతా ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నమేనని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే దోరణితో ముందుకు పోతున్నాయన్నారు.

# గాయపడ్డ జర్నలిస్ట్‌కు పరామర్శ



ఫరూఖ్‌నగర్, మేజర్ న్యూస్ (జూన్ 06): బైక్ ప్రమాదానికి గురై గాయాలపాలైన షాద్‌నగర్ సీనియర్ జర్నలిస్ట్ ఆంధ్రజ్యోతి విలేఖరి సంజీవ్ కుమార్‌ను శుక్రవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్ పరామర్శించారు. ఇటీవలే ప్రమాదానికి గురై కాలు, చేయికి గాయాలయిన సమాచారం తెలుసుకుని పట్టణంలోని జర్నలిస్ట్ సంజీవ్ స్వగృహంలో ఆయనను కలుసుకుని క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరు వివరాలను అడిగి తెలుసుకుని గాయాలబారి నుండి త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

# విత్తనాల ఎంపికలో రైతులంతా జాగ్రత్తలు పాటించాలి

## – వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం

నందిగామ, మేజర్‌న్యూస్ (జూన్ 06): వానాకాలం పంటల సాగు ఆరంభ సమయం ఆసన్నమవుతున్నందున రైతులు మార్కెట్లో ఇబ్బడి ముబ్బడిగా లభించే బయో విత్తనాలను కొనుగోలు చేయకుండ ప్రభుత్వం వ్యవసాయశాఖచే ఆధీకృతించబడ్డ విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం కోరారు. నిపుణులైన వ్యవసాయశాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులను గుర్తించి ప్రభుత్వానికి సిఫారస్ చేయడం జరుగుతుందని, రైతులంతా నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల బారినపడకుండ అప్రమత్తంగా వుండాలని సూచించారు. నందిగామ మండలం వెంకమ్మగూడలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి రామశివరావు ఆధ్వర్యంలో రైతుముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుకుమార్‌లు హాజరై రైతులకు వరి, పత్తి తదితర పంటల సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం వ్యవసాయాధికారి ఈ కార్యక్రమంలో రామశివరావు మాట్లాడుతూ రైతులు



ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను వ్యవసాయశాఖచే అనుమతి పొందిన ఆధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేసి విధిగా రశీదులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ టీచింగ్ అసోసియేట్ డాక్టర్ స్నేహలత, విద్యార్థులు సృజనీత, గ్రామ అభ్యుధయ రైతులు పాల్గొన్నారు.

## మాడ్గులలో ఘనంగా జాతీయ బీసికమీషన్ మాజీ సభ్యుడి పుట్టినరోజు



మాడ్గుల, మేజర్‌న్యూస్ (జూన్ 06): మాడ్గుల మండల భారతీయ జనతాపార్టీ అధ్యక్షులు నల్లగాసుల పెద్దయ్యయాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బీసికమీషన్ మాజీ సభ్యులు, బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్రకార్యవర్గసభ్యులు గౌని మల్లేష్‌గౌడ్, జిల్లా కార్యదర్శి దండు శ్రీనివాస్‌గౌడ్, వివిధ గ్రామాల బిజెపి, బిజెపి మోర్చాల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి పెద్దయ్యయాదవ్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లు ఆచారి పుట్టినరోజు కేక్‌ను కట్‌చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రావిరాల మహాదేవశర్మ, జక్కుల జంగయ్య యాదవ్, కొత్తపల్లి యాదయ్యగౌడ్, ఈరమల్ల శ్రీను, ఆదిమల్ల గిరి, యాదగిరి, అశోక్, హరీష్, శివ, ఆంజనేయులు గుప్త, మెట్టు కృష్ణ, ఎర్కలి లక్ష్మణ్‌గౌడ్ , భాస్కర్ నాయక్, అంజి, సిద్దు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ అధినాయకులకు ఆదివాసి కాంగ్రెస్ అధ్యక్షుడి సత్కారం







మాడ్గుల, మేజర్‌న్యూస్ (జూన్ 06): మాడ్గుల మండల కాంగ్రెస్ ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన పల్గుతాండ గ్రామపంచాయతి పడమటితాండకు చెందిన జఠావత్ లాలునాయక్ శుక్రవారం మండల కాంగ్రెస్ అధినాయకులను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ, గిరిజన, బంజారాలను కాంగ్రెస్‌కు మరింత చేరువచేసి పార్టీ బలోపేతం, రాబోవు స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ మద్ధతు అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహంపై అధినాయకులతో చర్చించినట్లు లాలునాయక్ వివరించారు. అంతకుముందు మండల కాంగ్రెస్ ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తన నియామకానికి సహకరించినందుకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఏఎంసి మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, సుద్ధపల్లి మాజీ సర్పంచ్, డిసిసి ఉపాధ్యక్షులు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, కాంగ్రెస్ సీనియర్‌నేత సూధిని కొండల్‌రెడ్డిలను శాలువాలతో సత్కరించి కృతజతలు తెలిపినట్లు లాలునాయక్ వివరించారు. మండల కాంగ్రెస్ అధినాయకులను కలిసిన సమయంలో తనతో పాటు కాంగ్రెస్ ఎస్టీసెల్ మాజీ అధ్యక్షులు నేనావత్ హరిలాల్‌నాయక్, పడమటితాండ కాంగ్రెస్ సీనియర్ నాయకులు జఠావత్ శర్మనాయక్, జఠావత్ చందునాయక్ తదితరులు ఉన్నట్లు ఆదివాసీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు లాలునాయక్ వివరించారు.

# జూన్ 9 వరకు దోస్త్ రెండవ దశ ప్రక్రియ

షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (జూన్ 06): ఇంటర్మీడియట్ పూర్తి చే సుకున్న విద్యార్థిని, విద్యార్థులు డిగ్రీ ప్రవేశాల కోసం దోస్త్ రిజిస్ట్రేషన్ తప్పనిసరని, ప్రస్తుతం సెకండ్ ఫేజ్ దోస్త్ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని గిరిజన సంక్షేమ మహిళా గురుకుల కళాశాలలో అడ్మీషన్‌లు పొందవచ్చని హైదరాబాద్ , రంగారెడ్డి రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జున రావు ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం రెండవ దశ దోస్త్ ప్రక్రియ జూన్ 9 వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా షాద్‌నగర్ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల కళాశాలలో ఎంపిసి, ఎంజెడ్‌సి, బీజెడ్‌సి, ఎంపిసిఎస్, బీఏ, బీకాం, ఇంటిగ్రేటెడ్ పిజీ కోర్సులలో చేరవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 6305051490, 9885003390, 9703441345 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## కేంద్రం కాల్పుల విరమణ ప్రకటించి

# శాంతి చర్చలు జరపాలి

- జూన్ 14న ఇందిరా పార్కులో మహాధర్నా
- అఖిలపక్షాల పిలుపు



**సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్( జూన్,6):** మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం బేషరతుగా శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ, మేడ్చల్ జిల్లాలో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. శుక్రవారం కాప్రా, ఈసియల్‌లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అఖిల పక్ష నాయకులు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకురాలు అనురాధ, ఐఎఫ్టీయూ శివబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి సత్యం, మాస్‌లైన్ నేత ప్రవీణ్ కుమార్, పిడిఎం చంద్రమౌళి, విముక్తి నేత పెర్క సునీత, ఇఫ్టూ షేక్ షావలి, బిఎల్ఎఫ్, బిఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కామెర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.నాయకులు మాట్లాడు తూ, గత 17 నెలలుగా కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరిట సుమారు 550 మంది ఆదివాసులను హతమార్చిందని ఆరోపించారు. ఆధునిక ఆయుధాలు, డ్రోన్లు, హెలికాప్టర్లు, టాంకులతో ఆదివాసులపై దాడులు చేయడం రాజ్యాంగ ఉల్లంఘనగా అభివర్ణించారు. మావోయిస్టులను హతమార్చే విధానాన్ని నిలిపి, శాంతి చర్చలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.
అటవీ సంపదల కోసం కార్పొరేట్ సంస్థలకు మార్గం సుగమం చేసేందుకు కేంద్రం ఆదివాసుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. బుద్ధిజీవులు, మేధావులు ఈ పరిస్థితిపై స్పందించాలని, లేకపోతే 'అర్బన్ నక్సలైట్' ముద్ర పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.'ఆపరేషన్ కగార్' హత్యాకాండకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం అవసరమని, ఇందులో భాగంగా జూన్ 14న హైదరాబాద్ ఇందిరా పార్కులో మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

ప్రజాస్వామిక వాదులు, సామాన్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి. దామోదర్ రెడ్డి, శంకర్రావు, తోటపల్లి శంకర్, గద్దర్ అభిమాన సంఘాల అధ్యక్షుడు సి.యల్. యాదగిరి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, సిపిఎం కార్మిక విభాగం సభ్యులు కోమటి రవి, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



కొడంగల్, మేజర్ న్యూస్ (జూన్ 6): ప్రతీ ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లు నరసింహారెడ్డి, వికార్ అహ్మద్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కంప్యూటర్ మిషన్ ఆధ్వర్యంలో ఏఎస్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంప్యూటర్ శిక్షణ నూతన టెక్నాలజీపై ఎంతో అవగాహన కలిగిస్తుందని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరీక్షలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు వచ్చేనెల 6న సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు శిక్షణ కేంద్రం నిర్వాహకులు అన్నపూర్ణ, పద్మనాభ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాణి, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## నేడు బక్రీద్



కొడంగల్, మేజర్ న్యూస్ (జూన్ 6):
త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ (ఈద్ ఉల్ ఆదా)ను ముస్లింలు శనివారం జరుపుకోనున్నారు. బక్రీద్ సందర్భంగా శనివారం ఉదయం 8 గంటలకు స్థానిక జామే మస్జీద్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఈద్గా లో 8:30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు మక్కా, జామే మస్జీద్‌ల కమిటీ అధ్యక్షులు ఎస్ఎం. గౌసన్, అఫ్రోజ్ ఖాన్ తెలిపారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలకు సమయానికి హాజరు కావాలని వారు కోరారు.

## రాక్‌వుడ్స్ఇంటర్నేషనల్ స్కూల్స్, ఓనన్ రోబోటిక్ హాస్పటల్స్ చైర్మన్ ఎం.రామానాయుడుకు ఎక్సలెన్స్ 2025 అవార్డు

ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్(జూన్ 06) : విద్యారంగం, పర్యావరణ సంరక్షణ, ఆరోగ్య రంగంలో చేపడుతున్న నూతన ఆవిష్కరణలకు గాను రాక్‌వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్, ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ చైర్మన్ ఎం. రామానాయుడు గురువారం ఈసిజీ ఫౌండేషన్ నుండి ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండో-యూకే గ్రీన్ డ్రైవ్ కార్యక్రమంలో యాదాద్రి వద్ద నవరగ్రహ వన ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా బ్రిటిష్ డిప్యూటి హై కమిషనర్ గ్యారెత్ విన్ ఓవెన్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యల చేతుల మీదుగా ఈసిజీ ఫౌండేషన్ అందించిన ఎక్సలెన్స్ 2025 ఆవార్డును రామానాయుడు అందుకున్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాక్‌వుడ్స్ ఇంటర్నేషనల్స్ స్కూల్స్ ద్వారా భవిష్యత్తును దృశ్య గ్లోబల్ పౌరులను తయారు చేయడం జరుగుతుందని, ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ ద్వారా రోబోటిక్ సర్జరీలకు పునాదిని వేసేప్రయత్నాలు చేస్తు సమాజ మార్పు దిశగా కృషిని గుర్తించి ఈసిజీ ఫౌండేషన్ ఎక్సలెన్స్ అవార్డు అందించడం ఆనందంగా ఉందని,




ఈ అవార్డు సమాజ మార్పుదిశగా మరింత బాధ్యత పెంచిందని గుర్తు చేశారు. అవార్డు అందించిన పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## తూముకుంటలో ఘనంగా ముగిసిన ఖో-ఖో వేసవి శిక్షణ శిబిరం


### క్రీడాకారులకు నైపుణ్యం పెంపొందింపులో కీలక శిక్షణ - గుర్రం సత్తిరెడ్డి



**శామీర్ పేట,మేజర్ న్యూస్ (జూన్ 6):** తూముకుంట పురపాలక సంఘ పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో డివైఎస్ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖో-ఖో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖో-ఖో సంఘం ఉపాధ్యక్షుడు గుర్రం సత్తిరెడ్డి విచ్చేశారు.
**గుర్రం సత్తిరెడ్డి మాట్లాడుతూ..**"వేసవి శిక్షణ శిబిరాలు క్రీడాకారులకు ఎంతో మేలు చేస్తాయి. వీటివల్ల క్రీడాకారులు ఆటలకు మరింత దగ్గరవుతారు. ప్రతి సంవత్సరం ఈ శిక్షణ శిబిరాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. ఇక్కడ శిక్షణ తీసుకున్న అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందారు" అని తెలిపారు.
**శిక్షకుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ...**"మే 1 నుండి జూన్ 6 వరకు ఉదయం, సాయంత్రం రెండు సెషన్లుగా ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహించాము. మొత్తం 60 మంది క్రీడాకారులు శిక్షణలో పాల్గొన్నారు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఖో-ఖో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, పాఠశాల ఉపాధ్యాయుడు తిరుమలేష్, సీనియర్ క్రీడాకారులు సందీప్ గౌడ్, సోమేశ్ యాదవ్, బలరాం, రఘువర్ధన్ గౌడ్, మన్మద్, సోమ్రాజ్, సుభాష్, తూముకుంట యూత్ సభ్యులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎంగేజ్ మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి...





**ఎంగేజ్ మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి.**

**పరిగి. మేజర్ న్యూస్ (జూన్ 06).**
పరిగి మండల పిఏసిఎస్ వైస్ చైర్మన్ శివన్నోళ్ల భాస్కర్ కూతురు సంధ్య, రంగారెడ్డి షాబాద్ మండలం చందన్ వెల్లి గ్రామానికి చెందిన కార్తీక్‌తో శుక్రవారం పరిగి పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో ఎంగేజ్ మెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు .

ఈ కార్యక్రమానికి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన బడిబాట కార్యక్రమం ప్రారంభం



కోదాడ, మేజర్‌న్యూస్ : రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల బలోపేత మే లక్ష్యంగా నిర్వహిస్తున్న బడిబాల కార్యక్రమం గ్రామ గ్రామాన శుక్రవారం ప్రారంభమైంది. అందులో భాగంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కోదాడ యందు బడిబాట ర్యాలీని ఎంఈఓ సలీం షరీఫ్ ప్రారంభించారు. పాఠశాలలో ఉన్నటువంటి సౌకర్యాలు కల్పిస్తున్న వసతులు, ప్రత్యేక దృష్టి పెడుతున్న అంశాల గురించి తెలియజేస్తూ కరపత్రం ఫ్లెక్సీలతో బడిబాట ర్యాలీ లో ఇంటింటికి వెళ్లి వివరించారు. 2025, 26 విద్యా సంవత్సరానికి తెలుగు,ఇంగ్లీష్ మీడియం, బాలురు బాలికలకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు విద్యార్థుల కు ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్య తో విద్యార్థుల సంపూర్ణ వికాసం జరుగుతుందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కంప్యూటర్ విద్య ను అందిస్తున్నామని తెలిపారు. చదువుతోపాటు విద్యార్థుల ప్రవర్తన సంస్కారం పై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. ఈనెల 6 నుండి 19వ తేదీ వరకు ప్రత్యేకంగా అడ్మిషన్ల కొరకు బడిబాట ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోదాడ పట్నంలో చెరువు కట్ట బజారు, ముస్లిం బజార్లో ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు వివరించి, పిల్లల నమోదు కార్యక్రమాన్ని చేపట్టినారు. అదేవిధంగా కోదాడ మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన బడిబాడ కార్యక్రమాల్లో ఎంఈఓ సలీం షరీఫ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి మార్కండేయ, ఈ. శ్రీనివాసరెడ్డి, కె. రామకృష్ణ, బి. కనకమ్మ, కె. పాండురంగ చారి, ఎస్ కె. ఖాజామియా, ఎం. జానకిరామ్, కె. రవి, అశోక్ గౌడ్ ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా

# పలు గ్రామాలలో జయశంకర్ బడిబాట

### - ప్రజా ప్రతినిధులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించిన ఉపాధ్యాయులు



మునుగోడు, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా పలు గ్రామాలలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశానుసారం మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మరియు సింగారం, రత్తిపల్లి గ్రామాలలో బడి ఈడు పిల్లలను బడికి పంపించి, ప్రభుత్వం ద్వారా అందించే ఉచితమైన నాణ్యమైన విద్యను పొందాలని కోరుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు బుధవారం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామ ప్రజలు, పెద్దలతో , ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి గ్రామంలో ఉన్న పాఠశాలను బలోపేతం చేయాలి అని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుంకరి బిక్షం గౌడ్,సంద ధనలక్ష్మి,నర్సిరెడ్డి,ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్,చండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి , మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి పి.రాజశేఖర్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు పాలకూరి నరసింహ గౌడ్ ,రత్తిపల్లి గ్రామం మాజీ సర్పంచ్ మాధగోని రాజేష్ గౌడ్ ,మాజీ ఉప సర్పంచ్ జంగం రాములు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుంభం భూపాల్ రెడ్డి,జంగం చంద్రశేఖర్,విఓఏలు పిట్టల రఘు,సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్,నేరటి నగేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లు షాహద, జంగం రామదాసు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



రాజపేట, మేజర్‌న్యూస్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుర్కపల్లి పర్యటన సందర్భంగా రాజాపేట మండల బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా టిఆర్ఎస్ నాయకుల నిరసన వ్యక్తం చేసే అవకాశం ఉందన్న సమాచారంతో రాజపేట మండలంలో పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ పార్టీ నాయకులను తెల్లవారుజామున 4 గంటల నుండి ముందస్తు అరెస్టు చేసి నిర్బంధించడం ప్రజాస్వామ్యంలో గొడ్డలి పెట్టని,రాష్ట్రంలో ప్రజాపాలనాన అని చెప్పి కాంగ్రెస్ నిర్బంధల పాలన చేస్తుందని, కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని విమర్శించారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నాయకులు చింతలపూరి వెంకట్ రామ్ రెడ్డి, జలసాధన కన్వీనర్ జశ్వంత్, మాజీ సర్పంచ్ లు గోపాల్ రెడ్డి, కరుణాకర్ నాయకులు పల్లె సంతోష్, ప్రవీణ్ బాలకృష్ణ,ఎమ్మా భాస్కర్ తదితరులు ఉన్నారు.

# నూతన కార్యదర్శుల ఎన్నిక



మోతే, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయం నందు శుక్రవారం బిజెపి మండల అధ్యక్షుడు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కార్యదర్శులు ఎన్నిక ఏకగ్రీవమైంది ప్రధాన కార్యదర్శులుగా మైనంపాటి శ్రీనివాస్ రెడ్డి, పెరుగు మధు మరియు కోశాధికారిగా రఘు నాయక్ ఎన్నికయ్యారు. శంకర్ నాయక్ వారికి శాల్వా కప్పి కృతజ్ఞతలు తెలిపారు.

# చిన్నకాపర్తిలో బడి బాట కార్యక్రమం



చిట్యాల, మేజర్‌న్యూస్ : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నకాపర్తి గ్రామంలో గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందించబడుతుందని, పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండే విధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాభోదనలు జరుగుతాయాన్ని, బడి ఇడు పిల్లలందరిని ప్రభుత్వ బడులలో చేర్పించాలని అన్నారు. మండల విద్యాధికారి సైదా నాయక్ మాట్లాడుతూ బడిబాట కార్యక్రమం ఈ నెల ఆరు నుండి పందొమ్మిది వరకు నిర్వాహబడుతుందని, రేపటినుండి డోర్ టు డోర్ విజిట్ చేసి బడి ఇడు పిల్లలందరినీ గుర్తించి వారందరిని ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమం గురించి తల్లిదండ్రులకు తెలిజేసి వారి పిల్లలను మన పాఠశాలలో చేర్పించే విధంగా ప్రతి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నకాపర్తి ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ఉపాధ్యాయురాలు గీత , గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి, రఘు, ఏఏపిసి చైర్మన్ మాధవి , గ్రామ పెద్దలు, ఆశవర్కర్లు, అంగన్వాడీ టీచర్స్, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు.



కోదాడ, మేజర్‌న్యూస్ : కోదాడ పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు జరిగినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి గాంధీ తెలిపారు. హైదరాబాద్ కు చెందిన స్టార్ టెక్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 17 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఎంపిక అయిన వారికి వార్షిక వేతనం 3.0 లక్షలు ఉంటుందని కంపెనీ హెచ్.ఆర్ వినయ్ మరియు విద్య సాగర్ తెలిపారు. ప్రాంగణ ఎంపికలకు సెలెక్ట్ అయిన విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ నీలా సత్యనారాయణ, కళాశాల డైరెక్టర్ నాగార్జున రావు లు అభినందించారు.

ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ మహమ్మద్ ఏజాజ్, రమేష్, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.